ప్రజాశక్తి
శుక్రవారం 12 డిసెంబర్ 2025 | 5 | కర్నూలు

# ఇద్దరికి జిల్లా బహిష్కరణ

- కలెక్టర్, ఎస్‌పి ఉత్తర్వులు జారీ

కలెక్టర్ సిరి

ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫేమస్ నగర్‌లో నివాసముండే కిరాయి హంతకుడు వడ్డే రామాంజనేయులు అలియాస్ వడ్డే అంజి (షీట్ నెంబర్.1)ను, సస్పెక్ట్ షీటర్ ఇమ్రాన్ (సస్పెక్ట్ షీట్ నెంబర్216) ను జిల్లా నుండి బహిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వడ్డే రామాంజనేయులు మీద జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 17కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అందులో హత్యలు, దోపిడీలు, ఎస్సీ ఎస్టీ వర్గాల మీద దాడులు, జూలు కేసులు, హత్యాయత్నం కేసులు ఇలా పలు రకాల కేసులు నమోదయ్యాయి. మరొక వ్యక్తి పఠాన్ ఇమ్రాన్ ఖాన్ మీద కూడా సుమారు 19 క్రిమినల్ కేసుల్లో నిందితుడు గా ఉన్నారు. పలుమార్లు వీరి పై తెలిపిన కేసుల్లో రిమాండుకు వెళ్లినా కూడా వారిలో ఎటువంటి మార్పు రాకపోవడం, 2022 వ సంవత్సరంలో వీరిద్దరూ కూడా పిడియాక్ట్ నిర్బంధ ఉత్తర్వు కింద కడప సెంట్రల్ జైల్లో ఖైదు చేయబడినప్పటికీ వీరి ప్రవర్తనలో మార్పు రాలేదు. రకరకాల కేసులలో పాల్గొంటున్నారని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రతిపాదన మేరకు వారి ఇద్దరి క్రిమినల్ రికార్డులను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి బుధవారం ఇద్దరి మీద జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటినుండి ఎవరైనా రౌడీయిజంతో అరాచక శక్తులుగా మారి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపై కూడా జిల్లా బహిష్కరణతో పాటుగా పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు. ప్రశాంతంగా, మంచిగా, బుద్ధిగా జీవించాలని కోరారు. ఇటువంటి చెడు నడత కలిగిన వారి పై కూడా జిల్లా బహిష్కరణ గురించి పరిశీలనలో ఉన్నామని తెలిపారు.

# చలి పంజా...!

- వణికిస్తున్న శీతల గాలులు - జిల్లాలో కనిష్టంగా 15 డిగ్రీలు నమోదు
- గతేడాది కంటే 7 డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రతలు - ఫ్లూ, జ్వరాలతో ప్రజలు సతమతం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

**డిసెంబర్ రెండో వారంలోనే జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. రోజంతా శీతల గాలులు వీస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. చలి, శీతల గాలులతో ప్రజలు ఫ్లూ, జ్వరాలతో సతమతం అవుతున్నారు. చలికాలంలో జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు.**

ఈ ఏడాది ముందుగానే జిల్లా వాసులను చలి వణికిస్తోంది. డిసెంబర్ రెండో వారంలో శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం కూడా కాకముందే వాతావరణం చల్లగా మారిపోతోంది. ఉదయం 11 గంటైనా చలిగాలులు ఆగడం లేదు. రాత్రి గడిచేకొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపించిపోతున్నారు. మొన్నటి వరకు కార్తీకమాసం ప్రారంభమైనా ఇంకా చలి ప్రారంభం కాలేదని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం చలితో పాటు శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఆదోనిలో అత్యల్ప ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. గతేడాది కంటే 7 నుంచి 8 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం తెల్లవారుజామున కర్నూలు నగరంలో అత్యల్పంగా 16 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదోని, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయంలోనూ 16 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వ్యవసాయభూములుండే గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చలి కారణంగా ప్రజలు జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది శ్వాసకోశ సమస్యలతో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అదే సమయంలో ఒక రకమైన ఇన్ఫ్లూయెంజా వైరస్ కూడా ఈ సీజన్లో వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శీతల గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

**ఆసుపత్రులకు పెరిగిన రోగులు**

చలి తీవ్రత పెరగడంతో ఆసుపత్రులకు రోగులకు సంఖ్య పెరుగుతోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఊపిరితిత్తుల విభాగానికి గతంలో ప్రతి బుధ, శని వారాల్లో ఓపీ ఉండేది. గతంలో ప్రతి రోజూ 50 మందికి పైగా రోగులు వస్తుండగా, గత కొన్ని రోజుల నుంచి రోగుల సంఖ్య రోజూ 80 దాటుతోంది. అలాగే ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లో జనరల్ ఫిజీషియన్లు, కార్డియాలజిస్టులు, పల్మనాలజిస్టుల వద్ద కూడా రోగుల సంఖ్య 30 శాతం పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు.

**దీర్ఘకాలిక రోగులూ జాగ్రత్త**

శీతాకాలంలో శీతల గాలులు విస్తున్న వేళ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మధుమేహం, బీపీ, చైరాటిస్, ఆస్తమా, సిఓపిడితో బాధపడేవారు దగ్గు, జలుబు, ఆయాసం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలిసి వారి పరిస్థితిని వివరించి చికిత్స తీసుకోవాలని అంటున్నారు. వీరు చలి కాలంలో ఉదయం వేళ మంచుకురిసే సమయంలో వాకింగ్, జాగింగ్‌కు వెళ్లకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు.

**పడిపోయిన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో) ఇలా..**

| నగరం | గతేడాది ఇదే సమయానికి | గురువారం |
|---|---|---|
| కర్నూలు | 23 | 16 |
| కోడుమూరు | 23 | 16 |
| ఎమ్మిగనూరు | 22 | 16 |
| ఆదోని | 23 | 16 |
| ఆలూరు | 23 | 15 |
| పత్తికొండ | 23 | 16 |
| మంత్రాలయం | 23 | 16 |

**ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి**

ఊపిరితిత్తుల వ్యాధులైన ఆస్తమా, సిఓపిడి ఉన్న వాళ్లు ఈ చలికాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే జబ్బు తీవ్రతరం అవుతుంది. దగ్గు, జలుబు, పిల్లికూతలు ఎక్కువవుతాయి. చల్లగా ఉండే పదార్థాలను తీసుకోకూడదు. దుమ్ము, ధూళి తగలకుండా జాగ్రత్త పడాలి. కాచి చల్లార్చిన నీరు తాగడం మంచిది.

- డాక్టర్ ఎ.శ్రీకాంత్, జిజిహెచ్ ఊపిరితిత్తుల విభాగం హెచ్‌ఒడి.

**చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు జాగ్రత్త**

చిన్నపిల్లలు, వృద్ధులు చలిగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో కోవిడ్ వచ్చిన వారిలో ఊపిరితిత్తుల్లో ఏదైనా ఇన్ఫెక్షన్ ఉంటే అది మరింత ఎక్కువవుతుంది. తప్పనిసరి పరిస్థితిలో బయట తిరిగేటప్పుడు మాస్కు ధరించడం చాలా మంచిది. తినేముందు ఖచ్చితంగా చేతులు కడుక్కోవాలి. దగ్గు, జలుబు వంటి వాటితో పాటు జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. షుగర్, గుండె జబ్బుల వ్యాధిగ్రస్తులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వాళ్లు మరింత జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ డి శ్రీనివాసులు, జిజిహెచ్ జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్.

## ఉల్లి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులకు ప్రకటించిన నష్టపరిహారాన్ని చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం ఈశ్వర్ రెడ్డి భవన్‌లో మండల కమిటీ సభ్యుడు దస్తగిరి అధ్యక్షతన జరిగిన సిపిఎం మండల కమిటీ విస్తృత సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉల్లి పండించిన రైతులకు హెక్టార్‌కు రూ.50 వేల నష్టపరిహారం ఇస్తామని రైతులను మోసం చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఉల్లి పండించిన రైతుల వివరాలను తక్షణమే నివేదిక తయారు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో టమాట, ఉల్లి, పత్తి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిసిఐ ద్వారా పత్తికి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం తూతూ మంత్రంగా గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అన్యాయం చేశారని అధికారులపై మండిపడ్డారు. తేమ పేరుతో రైతులను ద్రోహం చేస్తున్నారని, ప్రకృతి వైపరీత్యాలు వల్ల జరిగిన నష్టానికి రైతులు ఎలా బాధ్యులవుతారని అన్నారు. ఎటువంటి గ్రేడింగ్ లేకుండా పత్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చిందన్నారు. హంద్రీనీవా కాలువ కట్టలుడ ప్రవహిస్తున్న, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం రోజులో రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సిపిఎం పత్తికొండ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై సిపిఎం పోరాటం చేస్తుందని, హంద్రీనీవా పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, గంగన్న, సిద్ధయ్య, రవి, గోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

## పదిలో ఉత్తమ ఫలితాలకు చర్యలు

- డిఇఒ ఎల్.సుధాకర్ - డిఇఒగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాబోయే పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ సుధాకర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆయన డీఈవోగా బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత డిఇఒ శామ్యూల్ పాల్ ఆయనకు చార్జ్ అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిరిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తారని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ సుధాకర్

## 21 నుంచి పల్స్ పోలియో

-జిల్లాలో వంద శాతం వ్యాక్సినేషన్ చేయించాలి - కలెక్టర్ డా.ఎ.సిరి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

డిసెంబర్ 21 నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలో వంద శాతం వ్యాక్సినేషన్ చేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ సిఎల్‌జి బ్లాక్‌లో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లకు, సూపర్వైజర్లకు, ఇతర వైద్య సిబ్బందికి పల్స్ పోలియో సెన్సిటైజేషన్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 3 లక్షల 52 వేల 164 మందికి పల్స్ పోలియో వ్యాక్సిన్ వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**వైద్య సేవలపై ప్రజల నుండి వంద శాతం పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావాలి**

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, లేదా, మందులను ఫార్మసీలో ఇవ్వకుండా బయటికి పంపిస్తున్నారా? లేదా, ఏదైనా పరీక్షలకు బయటికి పంపిస్తున్నారా? డెలివరీ అయిన తర్వాత వైద్య సిబ్బంది ఏమైనా డబ్బులు వసూలు చేస్తున్నారా? లేదా, పారిశుధ్యం బాగుందా, లేదా, వైద్యులు సరిగా వైద్యం చేస్తున్నారా, లేదా, అనే అంశాల మీద ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామన్నారు. ఈ అంశాల్లో ప్రజలు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రజలు సంతృప్తి చెందేలా పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో వైద్యులు అందుబాటులో ఉండి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. సిబ్బంది మందులకు బయటకు పంపకూడదని, డెలివరీ అయిన తర్వాత పేషెంట్ నుండి వైద్య సిబ్బంది డబ్బులు వసూలు చేయకుండా చూసుకోవాలన్నారు. ఈ అంశాల పై మెడికల్ ఆఫీసర్లు వారానికి 2 సార్లు సమీక్ష నిర్వహించుకుని, ఇకపై ప్రజల నుండి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని పిహెచ్‌సిలలో 5 కంటే తక్కువ డెలివరీలు జరుగుతున్నాయని, ఖచ్చితంగా కనీసం 10 డెలివరీలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టాప్‌లు, మార్కెట్లు తదితర ప్రదేశాలలో 1600 వ్యాక్సినేషన్ బూత్‌లను, 52 పోలియో ట్రాన్సిట్ పాయింట్ (పీటిపీ)లను ఏర్పాటు చేశామన్నారు. 63 మొబైల్ టీంలను నియమించామని వివరించారు. సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సింధు సుబ్రమణ్యం, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

**తాగునీటి అవసరాలకు నీరు విడుదల**

**కర్నూలు కలెక్టరేట్** : జిల్లాలో తాగునీటి అవసరాల కోసం టిబి.డ్యామ్ నుండి ఏప్రిల్ లో 15 రోజులు కాకుండా 30 రోజులు నీరు వదలాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి టిబి డ్యాం ఎస్ఇని కోరారు. గురువారం ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తుంగభద్ర డ్యాం నుండి నీటి విడుదలపై అధికారులతో చర్చించారు. జనవరి 10వ తేదీ వరకు తాగునీటికి, పంటలకు వదలడం జరుగుతుందని, తదుపరి ఏప్రిల్‌లో తాగునీటి అవసరాలకు 15 రోజులు వదిలేందుకు బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఇ నారాయణ నాయక్ కలెక్టర్‌కు వివరించారు. ఏప్రిల్‌లో 15 రోజులే వదిలితే తాగునీటికి ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. తుంగభద్ర డ్యామ్ నుండి ఎమ్మిగనూరు దగ్గర ఉన్న గుడేకల్లు చేరుకోవటానికి 15 రోజులు పడుతుందన్నారు . అందువల్ల 30 రోజులు నీటిని వదలాలని, ఈ అంశంపై స్పెషల్ సిఎస్‌తో మాట్లాడి 30 రోజులు నీరు వదలాలని కోరతామని కలెక్టర్ తెలిపారు. టీబీ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి 30 రోజులు నీటిని విడుదల చేసేలా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఇకి తెలిపారు. జిల్లాలోని అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను జనవరి 10 లోపు తుంగభద్ర నది నీటితో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ మాసంలో వదిలే నీటిని తాగు నీటికి మాత్రమే వాడుకోవాలన్నారు. రైతులు రెండవ పంట వరి కి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసుకునేలా చూడాలన్నారు. సుంకేసుల నుండి కర్నూలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వరకు పైప్‌లైన్ పనులను మార్చి లోపు పూర్తిచేయాలన్నారు. ఆదోని ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులను వేగంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ బాలచంద్రారెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ పాండురంగయ్య, తుంగభద్ర బోర్డు ఎస్ఇ నారాయణ నాయక్, కర్నూలు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మనోహర్, జెడిఎ వరలక్ష్మి, డిపిఒ భాస్కర్ పాల్గొన్నారు.

సిలంబం విజేతలను అభినందిస్తున్న డాక్టర్ శంక్‌శర్మ

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

సిలంబం విజేతలకు డాక్టర్ శంక్‌శర్మ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రముఖగ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్‌శంకర్ శర్మ సూచించారు. 2వ సౌత్ జోన్ సిలంబం చాంపియన్ షిప్-2025 లో కర్నూలుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈపోటీలు గుంటూరులో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించారు. ఈపోటిల్లో కర్నూలుకు చెందిన 25 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్, 22 మంది సిల్వర్ మెడల్ సాధించారు. వారిని డాక్టర్. శంకర్ శర్మ గాయత్రీ ఎస్టేట్ లోని గురుదత్త పాలీక్లినిక్‌లో అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ కర్నూలు క్రీడా రాజధానిగా పేరొంది కర్నూలు నుంచి ఇంటర్నేషనల్ క్రీడాకారులు తయారు కావాలని కోరారు. సిలంబం క్రీడా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సిలంబం క్రీడ మొదట కర్రసాము అనేపేరుతో తమిళనాడు రాష్ట్రంలో ప్రారంభం అయిందన్నారు. ఎలాంటి ఆయుధాలు లేకుండా సిలంబం ఆడవచ్చన్నారు. సిలంబం క్రీడను ఒలింపిక్ క్రీడల్లో చేర్చేవిధంగా ఒలింపిక్ అసోసియేషన్ చర్చలు జరుపుతుందని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. సిలంబం ప్రాక్టీసు చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు శరీరం ధృడంగా ఉంటుందన్నారు. ఇలాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ముఖ్యంగా ఆడపిల్లలకు ఆత్మరక్షణకు తోడ్పడుతుందని డాక్టర్. శంకర్ శర్మ అన్నారు. సిలంబం శిక్షకుడు రాఘవేంద్ర అనారోగ్యంతో మరణించడం భాదగా ఉందని ఆయన కుమారుడు మహావీర్ తండ్రి ఆశయాలను కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో మహావీర్‌ను డాక్టర్‌శంకర్ శర్మ సన్మానించారు.

## డైట్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం బి తాండ్రపాడు గ్రామంలోని డైట్ కళాశాల వసతి గృహంలో సదరు కళాశాల విద్యార్థిని గురువారం మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని కర్నూలు తాలూకా సిఐ తేజోమూర్తి తెలిపారు. నంద్యాల జిల్లా, మిడుతూరు మండలం, చింతపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ (18)శుక్రవారం కళాశాలలోని వసతి గృహంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతుండగా స్థానిక సిబ్బంది గమనించి బయటికి తీసి హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందింది. చంద్రకళ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. చంద్రకళ ఇటీవలే మూడో విడత అడ్మిషన్లలో భాగంగా డైట్ కళాశాలలో మొదటి సంవత్సరం సీటు సంపాదించింది. ఆమెకు డైట్ కళాశాలలో చదడం ఇష్టం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

జడ్‌పి ఎదుట యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టెట్ పరీక్ష నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్‌ఎ రవికుమార్ అధ్యక్షతన జరిగిన నిరసనలో కె. సురేష్ కుమార్ మాట్లాడారు. సర్వీస్‌లో ఉన్నటువంటి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహించాలనే సుప్రీంకోర్టు ఆదేశాలపై రివ్యూ పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే యుటిఎఫ్ తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసి ఉపాధ్యాయులకు మినహాయింపు కోసం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ నిరసనలను మరింత ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి దీనిపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు లక్ష్మీదేవి, చంద్రకళ, జిల్లా సీనియర్ నాయకులు జయరాజు, నాయకులు కెంగార మోహన్, భాస్కర్, సోమన్న, హనుమన్న షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఎదుట యుటిఎఫ్ నిరసన

**పత్తికొండ**: ఇన్ సర్వీస్ నుండి ఉపాధ్యాయులకు టెట్ ఎగ్జామ్ నుండి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు.యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పత్తికొండలో పట్టణంలో నాలుగు స్తంభాల దగ్గర కూడలి నుంచి ఆర్‌డిఒ ఆఫీస్ వరకు యుటిఎఫ్ నాయకులు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ నాయకులు ఆర్‌డిఒ భరత్ నాయక్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఎగ్జాం నుండి మినహాయింపు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. టెట్ ఎగ్జామ్ అన్నది దాదాపు రాష్ట్రంలో లక్ష మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రభావం చూపిస్తుందన్నారు. ఈ ఎగ్జామ్ రాయడం వల్ల ఉపాధ్యాయులు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సీనియర్ నాయకులు ఆర్ ప్రసాద్ బాబు, కె.నర్సోజి, కె.రామమౌళి, కె.ఆదిశేఖర్‌రెడ్డి, రంగస్వామి, ఆలీబాష ,యువరాజు, భాస్కర్, రవి ప్రకాష్ రెడ్డి ,వెంకటేశ్వర్ రెడ్డి, నాగేష్ ,ఆకుల నాగేష్, జాగి , వీరేశ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





పత్తికొండ ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

### సర్కార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

టిడిపి పాణ్యం మైనార్టీ సెల్ కార్యదర్శి సర్కార్ హుస్సేన్ తల్లి షేక్ షాలుబి గురువారం అనారోగ్యంతో మృతి చెందింది.

నన్నూరు గ్రామంలోని సర్కార్ ఇంటికి ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు పాణ్యం బిసి సెల్ ఉపాధ్యక్షులు తలారి విజేయుడు , విద్యా కమిటీ ఛైర్మన్ మొల్ల జాకీర్ హుస్సేన్ , మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ ఖజామియ్య ,మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ షంషుద్దీన్ ,పట్టేల మెహన్ కరీం ఖాన్ లు ఉన్నారు.

## హింసను వ్యతిరేకిద్దాం : ఐద్వా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వీకర్ సెక్షన్ కాలనీలో బీసీ కాలనీ 41 వ వార్డు పరిధిలో నవంబర్ 25 నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న హింస వ్యతిరేక దినోత్సవం- మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం సెమినార్ ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు షకున్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల మాట్లాడారు. మహిళలకు ఢిల్లీ నుంచి గల్లీ దాకా రక్షణ లేకుండా పోతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను వంటింటికి పరిమితం చేయాలనుకుంటున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం అనేక విన్యాసాలతో మహిళలలో చొచ్చుక పోతుందని, మద్యం మత్తుమందు విపరీతంగా కొనుగోలు చేసేలాగా బెల్ట్ షాపులు అడుగడుగునా అమ్ముతున్న ప్రభుత్వాలు చర్య తీసుకోవడం లేదన్నారు. మన ఆవరణం చుట్టుపక్కల ఉన్న బెల్టు షాపులను ఎత్తివేసేంతవరకు పోరాటనికి ప్రతి ఒక్క మహిళ నడుం బిగించాలని తెలిపారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను మనం సాధించుకోవాలని హక్కులలో భాగంగా మహిళలకు ఉన్న రిజర్వేషన్లను సాధించుకునేంత వరకు కృషి చేయాలని తెలిపారు. ఈనెల 13న జై భీమ్ రియల్ హీరో జస్టిస్ చంద్రు సదస్సుకు మహిళలు, మేధావులు, ఉద్యోగులు దళిత మైనార్టీలు, అందరు కలిసి రావాలని కోరారు. మహేశ్వరమ్మ, షేకున్, సుగుణ, సరస్వతి, తులసి, సోఫియా, ముంతాజ్, కాలని మహిళలు పాల్గొన్నారు.

సెమినార్‌లోమాట్లాడుతున్నఐద్వాఅధ్యక్షులు శ్యామల

విరాళాలు సేకరిస్తున్న ఎపిరైతు సంఘం కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు

## సిఐటియు మహాసభలను విజయవంతం చేయండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిధి సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనెల 31 నుండి జనవరి 4వరకు విశాఖపట్నం నగరంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్న సందర్భంగా వాటి విజయవంతం కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘీభావంగా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో విరాళాలు సేకరించారు. నిధి సేకరణలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ జిల్లా నాయకులు బి మద్దిలేటి, నాయకులు మల్లేష్ శేఖర్ వీరస్వామి పూలరంగడు రవి తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ విరాళాలు ఇచ్చిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక కర్షక ఐక్యతకు నిరంతరం ప్రయత్నం చేస్తామని తెలిపారు. రాబోయే కాలంలో కార్మిక ఉద్యమంలో రైతు సంఘం తన వంతు పాత్ర నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వసూలైన నిధిని రాష్ట్ర కమిటీకి పంపిస్తున్నట్లు తెలిపారు. మొత్తం రూ.2510 వసూలు అయినట్లు తెలిపారు.

అధికారికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

## తాగునీటీ సౌకర్యం కల్పించి దాహం తీర్చండి

ప్రజాశక్తి-సి బెళగల్

మా వీధుల్లో ఏళ్లుగా తాగునిటీ సౌకర్యం కల్పించడంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారని తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించి దాహం తీర్చండి మహా ప్రభో అంటూ సి బెళగల్‌లో మహిళలు జిల్లా యంత్రాంగాన్ని వేడుకొంటున్నారు. గురువారం కమ్మరి ఆచారి వీధి, డాక్టర్ నాయుడు వీధి, చాకలి వీధి మహిళలు సుమారు 100 మందికి పైగా ఖాళీ బిందెలతో ఎంపిడిఒ ఆఫీసును ముట్టడించారు. ఏళ్లుగా తాగునీరు లేక పక్క విధుల్లోకీ వెళ్తున్నామని అక్కడ అడ్డుకుంటే సూదుర ప్రాంతాలకు వెళ్లి అవస్థలుపడుతున్నామని ఆవేదన చెందారు. గత మూడు నెలలుగా అధికారులకు,నాయకులకు విన్నవించినా తొంగి చూసిన పాపాన పోలేదని జిల్లా అధికారులైనా స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని లేదంటే కలెక్టరేట్ ను, ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.అనంతరం కార్యదర్శి శ్యామల వినతిని స్వీకరించి పరిష్కరించేందుకు దృష్టి సారిస్తామని వీధి మహిళలకు హామీ ఇచ్చారు.

ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

## సిసిఐ నిబంధనలు సడలించాలి

### - రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

**ప్రజాశక్తి - ఆదోని రూరల్**

సిసిఐ నిబంధనలు సడలించి పత్తిని కొనుగోలు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. ఆదోనిలోని జయంతి ఫ్యాక్టరీలో సిసిఐ అధికారులు నాణ్యత పేరుతో పత్తిని కొనుగోలు చేయకుండా తిరిగి పంపించడంతో గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల పట్ల సిసిఐ అధికారి కఠినంగా వ్యవహరిస్తూ సిసిఐ నిబంధనల పేరుతో పత్తిని కొనుగోలు చేయకుండా వెనక్కి పంపుతున్నారని తెలిపారు. రైతులు చేసేదేమీ లేక ఖర్చులు భరించి గ్రామాలకు తీసుకెళ్తున్నారని చెప్పారు. తక్షణమే సిసిఐ అధికారిపై చర్యలు తీసుకోవాలని, ఫ్యాక్టరీ యజమాని స్వయంగా పరిశీలించి, సిసిఐ అధికారికి చెప్పి నాణ్యత లేదని పత్తిని వెనక్కి పంపుతున్నారని తెలిపారు. మార్కెట్ యార్డు అధికారులు, ఇతర అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ సిసిఐ అధికారి చెప్పిందే జరుగుతోందని అన్నారు. తేమశాతం 9 ఉన్నా 12గా నమోదు చేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గుగ్గి, పసుపు, నల్ల రంగు ఉందని చెప్పి 50 మందిలో పది మందిని తిప్పి పంపుతున్నారని అనానరు. ఉన్నతాధికారులు స్పందించి సిసిఐ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, నాయకులు హనుమంత రెడ్డి ధర్నాకు నాయకత్వం వహించారు.

### ఆదోని జిల్లాగా ప్రకటించాలని

## నేటి నుంచి ఆలూరులో దీక్షలు : జెఎసి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**ప్రజాశక్తి-ఆలూరు**

ఆదోని జిల్లాగా ప్రకటించాలని ఆలూరులో శుక్రవారం దీక్షలు చేపడుతున్నట్లు జెఎసి నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో జెఎసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు భూపేష్, కత్తి రామాంజనేయులు మాట్లాడారు. జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో తాగు, సాగునీరు లేకపోవడం, రైతులు, కూలీలు వలసలు వెళ్లడం ప్రభుత్వాలు, పాలకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆలూరు పాతబస్టాండ్ ఆవరణలో రిలే నిరాహార దీక్ష ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరడోన కిష్టప్ప, అశోక్, రైతు సంఘం తాలుకా అధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మాజీ ఎంపిటిసి భాస్కర్, రామ్ భీం నాయుడు, కురువల్లి శివన్న, వరుణ్ పాల్గొన్నారు.

## 'ఆదోని' రిలే దీక్షలకు ప్రజా సంఘాల మద్దతు

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ఆదోని జిల్లా సాధనకు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు గురువారం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రాజీవ్ రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆదోని జిల్లా సాధన జెఎసి గౌరవాధ్యక్షులు కమల గణేష్, బతకన్న, వైసిపి ఇన్‌ఛార్జీ రాజీవ్ రెడ్డి, యువసేన నాయకులు బాబూలాల్, చాంద్ బాషా, ఆదోని జిల్లా సాధన విద్యార్థి జెఎసి కన్వీనర్ శేఖర్ నాయుడు, ఉదయ్, రఘు, కృష్ణ, ఖాజా, ఆఫ్రిద్‌లు దీక్షలో కూర్చున్న సభ్యులకు పూలమాల, కండువా వేసి దీక్ష ప్రారంభించారు. ఎంపిజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాదీర్, మూమెంట్ ఫర్ యూత్ నాయకులు ఇస్మాయిల్, చాంద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాజు, సిపిఐ ఎంఎల్ నాయకులు సత్యన్న, మాల మహానాడు నరసన్న మాట్లాడారు. ఇమ్రాన్, ప్రకాష్ రెడ్డి, చికెన్ రాజా హుసేని, సూర్యప్రకాష్ రెడ్డి, నాగలదిన్నె మహ్మద్, నూర్ బాషా, గువ్వల దొడ్డి గిడ్డయ్య, రామకృష్ణ యాదవ్, భరత్ రెడ్డి, బోయ శ్రీను, డిజి ఫణీంద్ర, రాము, మునిస్వామి పాల్గొన్నారు.

మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

# పత్తి మిల్లులో భారీ అగ్నిప్రమాదం

### - రూ.కోట్లలో ఆస్తి నష్టం

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని పట్టణంలోని పత్తి జిన్నింగ్ మిల్లుల్లో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతుండడంతో యజమానులు బెంబేలెత్తుతున్నారు. ఆదోని శివారులో ఉన్న ఎన్‌డిబిఎల్ పత్తి జిన్నింగ్ మిల్లులో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో మిల్లులో మంటలు చెలరేగాయి. భారీగా నిల్వ చేసిన పత్తి దూది బేళ్లు మంటలకు ఆహుతై బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న యజమాని బత్తిని కుబేర్‌నాథ్ మంటలను చూసి విషాదంలో మునిగిపోయారు. మంటలు విస్తరిస్తుండడంతో నాలుగు ఫైర్ ఇంజిన్ల ద్వారా మంటలను అదుపు చేయించామని ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు. నీళ్ల సరిపోక మంటలు ఎగిసిపడడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. సుమారు రూ.5 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లి ఉండవచ్చని ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం బసాపురం రోడ్డులో ఉన్న హరి కాటన్ మిల్లులో విద్యుత్ ప్రమాదం వల్ల భారీ నష్టం జరిగింది. ఈ ఘటన మరువక ముందే మళ్లీ ప్రమాదం జరగడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో సుమారు రూ.2 కోట్ల విలువ చేసే పత్తి కాలిపోయిందని యజమానులు తెలిపారు. వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతుండడంతో ఆదోనిలో పత్తి ఫ్యాక్టరీల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.

**కొనుగోళ్ల నిలుపుదల :** ప్రస్తుతం ఫ్యాక్టరీలో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదోనిలో 8 చోట్ల సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు జరుగుతున్నాయని, స్లాట్ బుక్ చేసుకున్న వారు ఇబ్బందులు పడకుండా మరో ఫ్యాక్టరీ పంపి కొనుగోలు జరుగుపున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదం వల్ల సిసిఐ ద్వారా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన పత్తి బేళ్లకు ఎలాంటి నష్టమూ జరగలేదని, సురక్షితంగా బయటికి తరలించి మరోచోట నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారి శ్రీనివాసులు తెలిపారు.

**ఎమ్మెల్యే పరామర్శ :** ఆదోని శివారులోని ఎన్‌డిబిఎల్ పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పార్థసారథి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును యజమాని కుబేర్‌నాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి త్వరగా సహాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**జిన్నింగ్ మిల్లు పరిశీలన :** ఆదోనిలోని సిరిగుప్ప క్రాస్ రోడ్డులోని ఎన్‌డిబిఎల్ పత్తి మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదాన్ని ఇన్‌ఛార్జీ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ పరిశీలించారు. అగ్ని ప్రమాదాన్ని జరిగిన తీరును యాజమాన్యంతో అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్‌డిబిఎల్, విఘ్నేశ్వరి, శ్రీశ్రీరామ, లక్ష్మీ చెన్నకేశవ, అభిరామ్, ధారశ్రీ, భవానీ, ఐశ్వర్య కాటన్స్‌లో అగ్ని ప్రమాద నివారణకు తీసుకునే చర్యలు, అగ్ని ప్రమాద అనుమతులు, విద్యుత్ అనుమతులను పరిశీలించారు. జిల్లా అగ్ని మాపక అధికారి అవినాష్ జయ సింహా, తహశీల్దార్ రమేష్, మార్కెట్ యార్డు సహాయ కార్యదర్శి కె.శాంత కుమార్, సహాయ అగ్ని మాపక అధికారి రామాంజనేయులు, విద్యుత్ శాఖ డిఇఇ నాగభూషణం పాల్గొన్నారు.

కాలి బూడిదైన పత్తి నిల్వలు

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

## 'ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు బడే సాబ్ కోరారు. గురువారం సిఐటియు అఖిలభారత మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఆటో యూనియన్ నాయకులు ప్రశాంత్ కుమార్, రమేష్, రంగస్వామి, సురేష్, రాజు, చిన్న, మహేష్, బి.రాజు, బి.గోపాల్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ వేతనాలు పెంచాలి : సిఐటియు

**ప్రజాశక్తి - ఆస్పరి**

అంగన్వాడీల వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు రంగస్వామి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల 4,687 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా జిఒ ఇచ్చారని, మిగిలిన 1,810 మినీ సెంటర్లను కూడా మెయిన్ సెంటర్లుగా చేయాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవా రం చేపట్టే కలెక్టరేట్ ముట్టడిలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు రవి, అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులు విశ్వకుమారి, కార్యకర్తలు బేగం, లత, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

## మురుగు కాలువలో పడి హమాలీ మృతి

**ప్రజాశక్తి - హోళగుంద**

స్థానిక అయోధ్యనగర్‌కు చెందిన రోడ్డే సిద్ధప్ప (45) ప్రమాదవ శాత్తు మురుగు కాలువలో పడి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆది శేషారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మృతుడు హమాలీ పని చేస్తూ జీవనం సాగించే వారని తెలిపారు. గురువారం బస్టాండు వద్ద ఉన్న ఓ కిరాణ షాపునకు చక్కెర లోడు లారీ రావడంతో మూటలు దించేందుకు వెళ్తుండగా బస్టాండు వద్ద ఉన్న కల్వర్ట్ దిమ్మెను గుద్ది మురుగుకాలువలో పడిపోవడంతో ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందినట్లు చెప్పారు. మృతుని భార్య రేణుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## మేధావులు పుడతారా..?

### - బాలికల హాస్టల్‌లో చర్చాగోష్టి

**ప్రజాశక్తి - ఆదోని రూరల్**

'మేధావులు పుడతారా..?, తయారు చేయబడతారా..?' అనే అంశంపై స్వర్ణాంధ్ర టీం ఆధ్వర్యంలో గురువారం ఆదోని ప్రభుత్వ బాలికల హాస్టల్ పదో తరగతి విద్యార్థులతో క్రియేటర్ కృష్ణ చర్చాగోష్టి నిర్వహించారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎస్.వెంకటరాముడు, ఆదోని సివిక్ సొసైటీ ఉపాధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్, అధ్యక్షులు రఘురాం, కార్యదర్శి కృష్ణ మోహన్, కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, విట్టా సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే లక్ష్యం

### - డిఐజి కోయ ప్రవీణ్

**ప్రజాశక్తి - ఆదోని**

వాహన వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే లక్ష్యంగా 'రక్షక్ ఫ్యూయల్ పెట్రోల్ పంపు స్టేషన్'లను నెలకొల్పుతున్నామని కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. గురువారం పట్టణంలోని టూ టౌన్ పోలీసు స్టేషన్ పక్కన డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పిసిఎల్ ఆయిల్ పంప్ స్టేషన్ ద్వారా వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్‌ను సరఫరా చేసి మంచి సేవలందిస్తామని తెలిపారు. ఈ పెట్రోల్ బంక్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని పోలీసు సంక్షేమ నిధికి వినియోగిస్తామన్నారు. పోలీసు శాఖకు, హెచ్‌పిసిఎల్‌కు 2011 నుంచి ఈ రకమైన అనుబంధం ఏర్పడిందని తెలిపారు. పట్టణంలోని పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని, మరమ్మతులు చేయించాలని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. నిధులు రాగానే క్వార్టర్స్‌ను వినియోగంలోకి తెస్తామని తెలిపారు. వినియోగదారునికి పెట్రోలు పోసి బేరం చేశారు. కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, రాయలసీమ హెచ్‌పిసిఎల్ రీజనల్ మేనేజర్ మన్మథరావు, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, ఆదోని రెండో పట్టణ సిఐ రాజశేఖర్ రెడ్డి, రామలింగమయ్య, నల్లప్ప, గౌస్, శ్రీరామ్, ఆర్ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐలు రామాంజనేయులు, రామస్వామి, రామనాథ్, నరసయ్య, మహేష్ పాల్గొన్నారు.

**డిఐజి కోయ ప్రవీణ్‌కు ఘన సన్మానం**

**ఆలూరు :** నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జీగా వైకుంఠం జ్యోతి నియమితులైన తర్వాత మొదటి సారి ఆలూరుకు వచ్చిన కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్‌ను కలిశారు. జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌తో కలిసి డిఐజికి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో డిఐజి కోయ ప్రవీణ్, డీఎస్పీ వెంకటరామయ్య, వైకుంఠం జ్యోతి దంపతులు నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించారు.

పెట్రోల్ పంపును ప్రారంభిస్తున్న డిఐజి

డిఐజి ప్రవీణ్‌ను సన్మానిస్తున్న నాయకులు

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION): ADONI
I.P.No.28 /2025

P.ఆలంభాషా, S/o లేట్ మాదర్‌సాబ్ పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ... పిటిషనర్

// VS //

1. మల్లికార్జున గౌడ్, S/o పాంపాపతి, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 7680907975.
2. రుద్రగౌడ, S/o తిప్పరెడ్డి, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 8497936934.
3. వీరుపాక్షి రెడ్డి S/o రుద్రగౌడు, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 8497936934.
4. వై. రాజశేఖర్ రెడ్డి, S/o తిప్పారెడ్డి , పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9603421725.
5. లక్ష్మీకాంత్ రెడ్డి, S/o గోవింద రెడ్డి, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
6. బోయ పార్వతి W/o బోయ కిష్టప్ప, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 6301584670.
7. చాకలి వీరేష్, S/o ఎరన్న , పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
8. ఉలేబీడు గిరి మల్లయ్య, S/o మల్లయ్య , ఉలేబీడు గ్రామం, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా.
9. ఎన్. నారాయణ రెడ్డి, S/o ఎన్. రామకృష్ణ రెడ్డి పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 7036186037.
10. మాల చన్నప్ప, S/o బసప్ప, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
11. రహీమాన్ సాబ్, S/o దస్తగిరి సాబ్, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
12. మాల శివమ్మ, W/o లేట్ నాగేంద్ర, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
13. హరిజన శిల్ప, D/o యల్లమ్మ, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 7981843440.
14. శంకర్ గౌడ్, S/o పాంపాపతి, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
15. రామలింగప్ప, S/o హనుమప్ప, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
16. బోయా లక్ష్మీకాంత, S/o బి. దొడ్డ బసప్ప,పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
17. బోయ లచ్చప్ప, S/o నారాయణమ్మ, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
18. బోయహనుమంతు, S/o వంద్రప్ప, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
19. గుళ్యం లక్ష్మీనారాయణ S/o దేవేంద్రప్ప, గుళ్యం గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
20. చిన్న మరెప్ప, S/o అదెప్ప గుళ్యం గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
21. హెూన్నూరు వలి, S/o బుడేన్ సాబ్, బాపురం గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9652357776.
22. ముల్లా అక్బర్ సాబ్, S/o ముల్లా షరీఫ్ సాబ్, బాపురం పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9900322478.
23. సరిత, W/o లక్ష్మీకాంత, బాపురం గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
24. రాంరాజ్, S/o లేట్ నాగరాజు, బాపురం గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
25. హాలహర్వి కిష్టప్ప, S/o లేట్ నెమకలప్ప, హాలహర్వి పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
26. మాల శంకరప్ప, S/o ఎం. మల్లయ్య, నిట్రవట్టి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 7799220917.
27. బారికి నాగరాజు, S/o సంగమేశ్వరప్ప నిట్రవట్టి, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9492562080.
28. హాలహర్వి కురువ ఉసేనీ, S/o లేట్ అయ్యప్ప హాలహర్వి పోస్టు & మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9177323296.
29. ఖాదర్ బాషా, S/o కురువల్లి చిన్న వలి, హాలహర్వి పోస్టు & మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9182082327.
30. యుగేందర్ రెడ్డి, S/o వీరభద్ర గౌడ్, బాపురం పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9640966180.
31. బుగెట్టి రెడ్డి, S/o లేట్ మల్లికార్జున రెడ్డి ,బాపురం పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9182748546.
32. విరుపాపురం బోగెట్ రెడ్డి, S/o తెలియదు, విరుపాపురం పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9347040729.
33. హుసేన్, S/o గోపి సాబ్ హత్తిబెళగల్ పోస్టు, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9989986991.
34. మాల ఆటో నరసింహ, S/o తెలియదు, హత్తిబెళగల్ పోస్టు, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 7036758057.
35. బల్లూరు శంకరప్ప, S/o రంగప్ప జె. హెూసల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
36. సోమయ్య, S/o మల్లయ్య జె. హెూసల్లి, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9441093632.
37. మల్లన్న గౌడ్, S/o తెలియదు, ఆలూరు టౌన్ & పోస్టు, కర్నూలు జిల్లా. ఫోన్: 9390853518, 9347609993.
38. ఎస్.ఎం. చాముండి, W/o కరి వీరయ్య, బుదేహాల్ గ్రామం, బళ్లారి జిల్లా. ఫోన్: 8197709863.
39. జె. విమలావతి, W/o కళ్యాణ స్వామి కమ్మరచేడు గ్రామం, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 8792234101.
40. రామయ్య శెట్టి, S/o పితంబ్రాప్ప,హాలహర్వి పోస్టు & మండలం.కర్నూలు జిల్లా, ఫోన్: 7702701315.
41. అగళూరు హెూసల్లి తిప్పేశా, S/o ఉలిగెప్ప, ఎం. హెూసల్లి గ్రామం, సిరుగుప్ప తాలూకా, బళ్లారి జిల్లా. ఫోన్ : 7396994160.
42. టి. కవిత, W/o శేషయ్య రెడ్డి, అరెకెర గ్రామం, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 8073559465.
43. కురువ చంద్రమ్మ, W/o కె. గడిలింగప్ప, హులేబీడు పోస్టు, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9052270578.
44. ఎం. గాదిలింగప్ప, S/o తిప్పయ్య హర్దగేరి పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9493850282.
45. డి. గంగమ్మ, S/o లేట్ నాగభూషణ, వెలిగండ గ్రామం, ఊరవకొండ మండలం, అనంతపురం జిల్లా. ఫోన్: 6281819556.
46. చాకలి ఉలిగెప్ప, S/o చాకలి సుంకన్న, హాలహర్వి పోస్టు & మండలం, కర్నూలు జిల్లా.
47. బసిరహల్లి నెల్లమ్మ, C/o బసిరహల్లి వీరబద్ర గౌడ్, హాలహర్వి పోస్టు & మండలం, కర్నూలు జిల్లా.
48. సరిత, W/o లక్ష్మీకాంత, బాపురం గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
49. జయన్న, S/o నరసప్ప పచ్చర్లపల్లి గ్రామం, వ్యాపారి, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
50. హెచ్. నారాయణ రెడ్డి, S/o తిమ్మరెడ్డి, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 7989203026.
51. మాల గంగమ్మ, D/o పెద్ద రామయ్య, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 6300362741.
52. మాల నరసప్ప, S/o మాల యల్లమ్మ, పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
53. రమీజాబీ, W/o లేట్ ఆలమ్ బాషా,పచ్చర్లపల్లి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
54. గుళ్యం శేక్షావలి, S/o తెలియదు, గుళ్యం పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్ : 9014668314.
55. గుళ్యం లక్ష్మీనారాయణ, S/o దేవేంద్రప్ప గుళ్యం పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 918454371.
56. పచ్చహల్లి ఈరన్న, S/o లింగన్న, గుళ్యం, జె. హెూసల్లి, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్:6309799753.
57. ఆటో హనుమంతు, S/o తెలియదు, గుళ్యం, జె. హెూసాలి, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్ : 8790688824.
58. మదిగా మహేంద్ర, S/o తెలియదు, గుళ్యం, జె. హెూసాలి, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
59. బోయ శేకన్న, S/o తెలియదు, గుళ్యం, జె. హెూసాలి, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
60. బాపురం సక్రయస్వామి, S/o తెలియదు, బాపురం గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా.
61. బారికి నాగరాజు, S/o తెలియదు, నిట్రవట్టి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్: 9492562080.
62. బాను, D/o పూల బాషా, హత్తిబెళల్ పోస్టు, ఆలూరు మండలం, కర్నూలు జిల్లా.
63. గుమ్మనూరు లక్ష్మీకాంత, S/o పక్కీరప్ప, బాపురం పోస్టు, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా. ఫోన్ : 9542259895.

.... రెస్పాండెంట్స్

**జనరల్ నోటీస్ టు పబ్లిక్**

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా పైన తెలిపిన పిటిషనర్ అయిన P.ఆలంబాషా గౌవరనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆదోనిలో పైన కనపరిచిన రెస్పాండెంట్స్ పై దివాలా దావా దాఖలు చేసియున్నారు. కావునా ఎవరికైనా ఇందుపైకి ఆక్షేపణలు మరియు అభ్యంతరములు గాని ఉన్న యెడల తేది : 12-12-2025న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ముందు స్వయంగా కాని వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలువపచ్చును. ఎవ్వరూ హాజరు కాని యెడల పై కోర్టు వారు కేసును పిటిషనర్ / దివాలదారుని పరముగా తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : 12-12-2025

పి.హుస్సేన్ సాని,
సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ,
పిటిషనర్ తరపున న్యాయవాదులు
ఆదోని -518301. సెల్ : 9346807746

IN THE COURT OF THE CIVIL JUDGE
(JUNIOR DIVISION) ALUR
O.S.No. 106/2024

Molagavalli Saralamma & another ... Plaintiffs

V/s

K. Vijaya Sujatha & another. ...Defendants

**SUIT SUMMONS TO THE DEFENDANT No.1**

To
K. Vijaya Sujatha
W/o Late J. Prasad,
R/o Budhawarpeta,
Kurnool City & District, PIN-518002

Whereas the above named plaintiff filed the above suit for permanent injunction as against you. Hence you are hereby required to attend before this Hon'ble court on **22.12.2025 at 10.30 AM** in person or through an advocate and answer the said suit, otherwise the matter will be decided exparte.

**(By court Order)**

**S.P Eranna,**
Advocate,
Adoni.
Cell No.9866933836

IN THE COURT OF THE CIVIL JUDGE
(JUNIOR DIVISION) ALUR
I.A.No.256/2024 in O.S.No.106/2024

Molagavalli Saralamma & another. ...Petitioners/Plaintiffs

V/s

K. Vijaya Sujatha & another. ...Respondents/Defendants

**NOTICE TO THE RESPODNENT No.1**

To
K.Vijaya Sujatha
W/o Late J. Prasad,
R/o Budhawarpeta,
Kurnool City & District, PIN-518002.

Whereas the above named petitioner filed the above petition Under Order 39 Rule 1 & 2 of CPC by restraining you from interfering with the peaceful possession and enjoyment of the petitioner in respect of petition schedule property. Hence you are hereby required to appear before this Hon'ble court on **22.12.2025 at 10.30 AM** in person or through an advocate and answer the said petition, otherwise the matter will be decided exparte.

**(By court Order)**

**S.P Eranna**
Advocate, Adoni
Cell No.9866933836

## సీనియర్ ఉపాధ్యాయులను

## టెట్ నుంచి మినహాయించాలి : యుటిఎఫ్

**ప్రజాశక్తి - ఆస్పరి**


మండల అధ్యక్షులు కె.లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి సి.బాబు

2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా, జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా సి.నాగూర్ బాష, అధ్యక్షులుగా కె.లక్ష్మన్న, సహాయ అధ్యక్షులు సునీత, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సి.బాబు, ఆర్థిక కార్యదర్శిగా హనీఫ్, జిల్లా కౌన్సిలర్లుగా పి.రంగన్న, బి.వెంకటేష్, ఖలీల్, మధులత, రామ లక్ష్మమ్మ, పవన్, ఓ.రంగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### స్థలాన్ని కబ్జా చేసేందుకు

## సర్వే నెంబరే మారుస్తారా

### - వసంతరాయుడు, చంద్రశేఖర్

**ప్రజాశక్తి - ఆస్పరి**

గ్రామ కంఠానికి సంబంధించిన సర్వే నెంబర్ 112లోని ఆరు సెంట్ల స్థలాన్ని కబ్జా చేసేందుకు మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు 212 సర్వే నెంబర్‌గా చెప్పి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వసంతరాయుడు, మూలింటి చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1996-97వ సంవత్సరంలో మట్టి రంగన్న సర్పంచిగా ఉన్నప్పుడు ఆ స్థలాన్ని ఎస్సీ కమ్యూనిటీ హాలు, మారమ్మ, ఎల్లమ్మ దేవాలయాలు నిర్మించేందుకు పంచాయతీ తీర్మానం చేసి, ఆలయాల నిర్మాణం కూడా చేపట్టారని తెలిపారు. అక్కడ ఉన్న ఆలయాలను కూడా పడగొట్టి 2012లో నకిలీ పట్టాలను పొందారని, లింక్ డాక్యుమెంట్లు కూడా లేవని చెప్పారు. అలాంటి భూమిని తనదని చెప్పుకోవడం ప్రజలను మోసగించడమే అవుతుందన్నారు. హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న కేసులో వెంకటేశ్వర్లు పొందిన పట్టాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అంతా ఫేక్ అని అప్పటి తహశీల్దార్ నిత్యానంద రాజు నిర్ధారించి.. ఆ స్థలం గ్రామ కంఠమని హైకోర్టుకు నివేదిక ఇవ్వడంతో ఆయన కేసు నుంచి తప్పుకున్నారని తెలిపారు. 2024 టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫిబ్రవరిలో రాత్రికి రాత్రి జెసిబితో ఎస్సీ కమ్యూనిటీ హాలు, మారెమ్మ, ఎల్లమ్మ దేవాలయాలను కూల్చేశారని బిల్లేకల్లు గ్రామస్తులు ముక్కన్న, పెద్దయ్య, లక్ష్మన్న, రాజు అధికారులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు ఆ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు భూమి పూజ చేసిన విషయం తెలిసి కలెక్టర్ ఎ.సిరికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ తహశీల్దార్‌ను పంపించి పనులను నిలిపేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని టిడిపి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నెట్టేకల్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వసంతరాయుడు, చంద్రశేఖర్


మేఘనా రెడ్డిని అభినందిస్తున్న తాలూకా క్రికెట్ అసోసియేషన్

## సౌత్ జోన్ క్రికెట్ జట్టుకు ఆదోని విద్యార్థిని

**ప్రజాశక్తి - ఆదోని**

సౌత్ జోన్ అండర్-15 క్రికెట్ బాలికల జట్టుకు ఆదోని క్రీడాకారిణి మేఘనా రెడ్డి ఎంపికైనట్లు తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కెఎం.ముజీబ్ తెలిపారు. గురువారం క్రికెట్ జట్టుకు ఎంపికైన మేఘనా రెడ్డిని తాలూకా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 13 నుంచి నెల్లూరులో జరిగే సౌత్ జోన్ క్రికెట్ జట్టులో మేఘనా రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. 13 జిల్లాల నుంచి ఐదు జట్లుగా ఎంపిక చేశారని, అందులో సౌత్ జోన్ తరఫున మేఘనారెడ్డి ఆడతారని చెప్పారు. ఇక్కడ ప్రతిభ కనబరిస్తే ఆంధ్ర జట్టుకు ఎంపిక అవుతారని తెలిపారు. తాలూకా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పులికొండ వెంకటేష్, సహాయ కార్యదర్శి జెఎం.బాషా, కంబి రెడ్డి, షాబీర్ బాషా పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని

**ప్రజాశక్తి - మంత్రాలయం**

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని బిజె.శైలజను పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు విఠోభరావు, ఉపాధ్యాయులు అభినందించారు. గురువారం స్థానిక జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన మాట్లాడారు. ఈనెల 8, 9, 10వ తేదీల్లో నరసరావుపేటలో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శైలజ నెల్లూరు, చిత్తూరు జిల్లాలపై ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్-17 ఫుట్‌బాల్ ఎజిఎఫ్ పోటీలు ఈనెల 17 నుంచి జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుల్తానా, ఉమామహేశ్వరి, శ్రీకృష్ణ పరబ్రహ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్ర, నరసింహ రాజు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

భూమి పూజ చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి, నాయకులు

## అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

### - టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

**ప్రజాశక్తి - కోసిగి**

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్రరెడ్డి తెలిపారు. గురువారం నియోజకవర్గంలోని పెద్దకడబూరు, కోసిగి మండలాల్లోని గంగులపాడు, బాపులదొడ్డి, కోల్మన్‌పేట, మూగలదొడ్డి గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రైతుల పురోగతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. టిడిపి మండల సీనియర్ నాయకులు ముత్తురెడ్డి, మండల అధ్యక్షులు రామిరెడ్డి, జ్ఞానేష్, మధురై వీరారెడ్డి, ఉప్పలపాటి అర్జున్, వీరారెడ్డి, చంద్రహాస్ పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి కూటమి కృషి : టిడిపి

**ప్రజాశక్తి - నందవరం**

భూమిపూజ చేస్తున్న నాయకులు

రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టిడిపి హాలహర్వి నాయకులు తెలిపారు. టిడిపి మండల నాయకులు రైస్‌మిల్ నారాయణ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ దావీదు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, మండల కార్యదర్శి ప్రభుదాసు, కో క్లస్టర్ ఇన్‌ఛార్జీ నాగరాజు, మాజీ సర్పంచి దాసు, నాయకులు జగన్నాథ్ రెడ్డి, ఉపాధి హామీ ఎపిఒ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ రాజు నూతన గోకులం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులు పశువులను ఉంచుకోవడానికి రూ.లక్షల వ్యయంతో మినీ గోకులాలను నిర్మిస్తున్నామని చెప్పారు. గ్రామంలో నూతనంగా నాలుగు గోకులం షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. బోయ గోవిందు, సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు జి.మణికుమార్, బోయ వెంకటరాముడు, చిన్న దావీదు, సురేష్, ఏసేపు, జి.దుబ్బన్న, బోయ బుడ్డ రంగన్న, గొల్ల రవి, ప్రభాకర్, వెంకట్రాముడు, ఆంధ్రయ్య, బూత్ కన్వీనర్ ఆనంద్, అంజి, మాల గోరంట్ల, గోవిందు పాల్గొన్నారు.

## వైభవంగా గాది లింగేశ్వర స్వామి రథోత్సవం

**ప్రజాశక్తి - హాలహర్వి**

మండలంలోని గూళ్యం గ్రామంలో గురువారం శ్రీశరణు గాదిలింగేశ్వర స్వామి వారి పూల రథోత్సవం వైభవంగా సాగింది. ప్రతేడాది డిసెంబర్‌లో పూల రథోత్సవం నిర్వహిస్తారు. ప్రధాన అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, గాదిలింగేశ్వర పారాయణం, అష్టోత్తరం జరిపించి స్వామివారికి విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం 7 గంటలకు పూల రథోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే విరూపాక్షి, గూళ్యం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

IN THE COURT OF THE III ADD.JUNIOR
CIVIL JUDGE CUM SPL.
MOBILE COURT:: KURNOOL
O.S. No.1009 /2022

Canara BankRep. by its Manager,
SME Branch, Kurnool. ...Plaintiff.

-Versus-

P.Mahesh. ...Defendant.

**DEFENDANT**:
P.Mahesh S/o P.Jammanna, Aged about 32 years, Resident of H.No.77-540,Muzaffar Nagar,Kalluru Manadal ,Kurnool-518003

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాది అయిన మీ నుండి రావలసిన అప్పును రూ. 1,85,195/- ను తిరిగి రాబట్టుకొనుటకు వాది మీపై పై కోర్టులో దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణ ఉన్న 23-12-2025వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో మీరు గానీ మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

Amount Due: Rs.1,85,195/-

**(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)**

**Next Hearing Date:23-12-2025**

Address for Service:
**Malik Basha Shaik,**
Advocate,Kurnool.

IN THE COURT OF THE ADDITIONAL
SENIOR CIVIL JUDGE : KURNOOL
E.A NO.167/2024 IN E.A.NO.48/2022,
E.P.NO.82/2021 IN O.S.NO.16/1997

C.A.Venkatesh Varma and Others. ...Petitioners

-Vs-

P.Shakunthalamma and others. ...Respondents

**NOTICE TO RESPONDENS 1 TO 8**

1) పి.శకుంతలమ్మ భర్త పి.రామచంద్రయ్య (లేట్)
2) పి.శ్రీనివాస ప్రసాద్ భర్త పి.రామచంద్రయ్య (లేట్)
3) పి.వెంకటేశ్వర ప్రసాద్ తండ్రి పి.రామచంద్రయ్య (లేట్)
అందరూ ఇంటి నెం. 27/58ఎ, పేట, కర్నూలు.
4) వి.శేషఫణి తండ్రి వెంకటశెట్టి
5) వి.విజయమోహన్ తండ్రి వి.వెంకటశెట్టి
ఇద్దరూ ఇంటి నెం.27/85, మెయిన్ రోడ్డు, I టౌన్ P.S దగ్గర, పేట, కర్నూలు
6) జె.వెంకటేశ్వర్లు తండ్రి జె.వివేకానంద
ఇంటి నెం. ప్లాట్ నెం.107, బి.బ్లాక్ సూర్య టవర్స్, చల్లా కాంపౌండ్, కర్నూలు
7) సి.ఎ. లోకేష్ వర్మ తండ్రి సి.ఎ. నరసింహ వర్మ
8) సి.ఎ. శ్రీనివాస వర్మ తండ్రి సి.ఎ. నరసింహ వర్మ
ఇంటి నెం.54/27ఎ, మున్సిపల్ హాస్పిటల్ రోడ్డు, కోట, కర్నూలు.

పై నెంబర్ అర్జీలో అర్జీదారులు 17.09.2024వ తేదీన E.A.48/2021ని డిఫాల్ట్ క్రింద త్రోసివేసిన అర్జీని రిస్టోర్ చేస్తూ తిరిగి ఫైలులోకి తీసుకొనమని అర్జీదారులు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 1 నుండి 8 రెస్పాండెంట్లు అయినా మీకు ఆక్షేపణ ఉన్న 29.12.2025వ తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపు కొనవలెను లేని ఎడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

**(కోర్టువారి ఉత్తర్వు మేరకు)**

**పోకల శ్రీనివాసులు,**
అర్జీదారుల పరం అడ్వకేటు, కర్నూలు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తికి సహకరించండి

**ఎన్నికల ప్రక్రియలో బిఎల్ఎల పాత్ర కీలకం-కర్నూలు రిటర్నింగ్ అధికారి పి.విశ్వనాథ్**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌ను బూత్ స్థాయిలో ఖచ్చితంగా, ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేసేందుకు సహకరించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో అసిస్టెంట్ ఆర్వోలు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను ప్రతి బూత్‌లో అత్యంత జాగ్రత్తతో పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఓటర్ వివరాలు, చిరునామా ధృవీకరణ, కుటుంబ సభ్యుల సమాచారం తప్పనిసరిగా బూత్ యాప్‌లో ఖచ్చితంగా నమోదు కావాలన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కర్నూలు అసెంబ్లి నియోజకవర్గంలో మొత్తం 2,74,803 మంది ఓటర్లలో 37,561 మంది మ్యాపింగ్ పూర్తికాగా, 15,821 మంది ప్రోజనీ వివరాలు నమోదు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం మ్యాపింగ్ శాతం 19.46శాతం ఉందన్నారు. ప్రతి బూత్‌లో 100శాతం మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ఖచ్చితత్వం ఎన్నికల పారదర్శకతకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కర్నూలు నియోజకవర్గానికి అదనంగా ముగ్గురు అదనపు ఎఇఆర్‌ఒలను జిల్లా కలెక్టర్ నియమించారని, ఆర్‌జివి.కృష్ణ (అదనపు కమిషనర్), కెవి.సతీష్ కుమార్ రెడ్డి (డిప్యూటీ కమిషనర్), పివి.శేష సాయి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) ప్రతిరోజూ బిఎల్‌ఒ సూపర్వైజర్లు, బిఎల్‌ఒల ఎస్ఐఆర్ పనితీరును సమీక్షిస్తున్నారని తెలిపారు. బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేస్తున్నారని, బిఎల్‌వో సూపర్వైజర్లు ప్రతిరోజూ బిఎల్‌వోలు సందర్శించిన ఇళ్ల సంఖ్య, మ్యాపింగ్ పురోగతి, కుటుంబ వివరాలు పూర్తి చేశారా అన్న విషయాలను పరిశీలిస్తున్నారని ఆర్‌ఒ వివరించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, వయస్సు ధృవీకరణ, చిరునామా నిర్ధారణ వంటి అంశాలను బూత్ స్థాయిలో సమగ్రంగా అమలు చేస్తే కర్నూలు రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా నిలుస్తుందని ఆర్వో ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్ రవికుమార్, అదనపు ఎఇఆర్‌ఒలు కెవి.సతీష్ కుమార్ రెడ్డి, ఉప తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆధునీకరించిన అపోలో ఫార్మసీ ప్రారంభం

**వారంలో రెండు రోజులు ఉచితంగా షుగర్, బిపి పరీక్షలు**

**ప్రజాశక్తి-కోడుమూరు**

కోడుమూరులో అన్ని హంగులతో ఆధునీకరించిన అపోలో ఫార్మసీని ముఖ్య అతిథి డాక్టర్ అశోక్ కుమార్ గురువారం ప్రారంభించారు. కర్నూలు రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.సత్యారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూకోడుమూరు పట్టణంలో రెండు అపోలో ఫార్మసీ బ్రాంచీలు ఉన్నాయని, మా అపోలో ఫార్మసీలో ప్రతినెల మొదటి ఆదివారం, మూడో ఆదివారం షుగర్ , బిపి పరీక్షలు ఉచితంగా నిర్వహించి తగిన సలహాలు సూచనలు ఇస్తామన్నారు. ఈ సదవకాశం కోడుమూరు పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మా అపోలో ఫార్మసీలో నాణ్యమైన మందులు సరసమైన ధరలకు లభిస్తాయన్నారు. సరయిన శిక్షణ కలిగిన సిబ్బందితో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మా అపోలో ఫార్మసీ ప్రతి ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు అదుబాటులో ఉంటుందన్నారు. మా ఉత్పత్తులపై స్పెషల్ డిస్కౌంట్ ఇస్తామన్నారు. ఈ ప్రారంభోత్సవంలో కర్నూలు ఎగ్జిక్యూటివ్స్ ఉమాపతి, చంద్రశేఖర్, మోహన్, ఖాదర్ ,మధు కుమార్ పాల్గొన్నారు.

## మత్స్య సహకార సొసైటీ చైర్మన్‌గా నవీన్ కుమార్

**ఉత్తర్వులను జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రాష్ట్ర మత్స్య సహకార సొసైటీ చైర్మన్‌గా బిఎస్ నవీన్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. రాయలసీమ జిల్లాల నుండి తొలిసారిగా రాష్ట్రస్థాయి చైర్మన్‌గా బిఎస్ నవీన్ కుమార్ ఎన్నికయ్యారు. ఆయన ఆరు నెలల పాటు ఈ పదవిలో ఆయన కొనసాగుతారని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రంలో ఆఫ్కాఫ్ పరిపాలన, మత్స్య సహకార సంఘాల అభివృద్ధి, సంబంధిత రంగాలలో పారదర్శకతను పెంపొందించే చర్యలు చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన నవీన్ కుమార్ నియామకం, జిల్లా మత్స్యకార వర్గాలకు, సహకార సంఘాలకు భరత దోహదపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయనకు జిల్లా మత్స్య సహకార సొసైటీ డైరెక్టర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

## సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

**సచివాలయాలను సందర్శించిన ఎంపిడిఒ**

**ప్రజాశక్తి-కోడుమూరు**

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ ఎసి రాముడు సూచించారు. కోడుమూరు పరిధిలోని ఒకటి, ఐదు సచివాలయాలను ఎంపిడిఒ గురువారం పర్యవేక్షించారు. గ్రామ సచివాలయం సిబ్బంది కచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండి ఉదయం 10:30 గంటలకు సాయంత్రం ఐదు గంటలకు కచ్చితంగా బయోమెట్రిక్ అటెన్‌డెన్స్ వేయాలని, సర్వే పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా పూర్తి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సూచించారు. మండలంలోని హౌసింగ్ ఆఫీస్ లో సర్వే వివరాలు , గృహ నిర్మాణ లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రాసెస్‌కు సంబంధించి మండల కేంద్రంలో ఉన్నటువంటి గృహ నిర్మాణ శాఖ కార్యాలయం కూడా సందర్శించి సూచనలు ఇచ్చారు. చదువుకున్న నిరుద్యోగ యువతకు కౌశలం పేరు మీద ప్రతి సచివాలయంలో ఎగ్జామినేషన్స్ జరుగుతున్నాయని, ఆ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వాళ్లు ఆన్‌లైన్ నమోదు చేసుకున్న వాళ్ళందరికీ కూడా సంబంధిత డిజిటల్ అసిస్టెంట్ వారికి సమాచారం ఇచ్చి పిలిపించుకొని ఎగ్జామినేషన్ రాయిస్తున్నామన్నారు.కౌశలం పథకం కింద నమోదు చేసుకున్న ప్రతి లబ్ధిదారులు కూడా డిజిటల్ అసిస్టెంట్ ఇచ్చిన సమాచారం మేరకు సచివాలయాన్ని సందర్శించి పరీక్ష రాయాలని తెలిపారు.

# మహిళ ప్రాణం తీసిన మెడికవర్ పై చర్యలు తీసుకోవాలి

**డివైఎఫ్ఐ బృందం డిమాండ్**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

మెడికవర్ హాస్పిటల్ లో గురువారం ఒక మహిళ మృతి చెందిందన్న విషయం తెలుసుకుని మెడికవర్ హాస్పిటల్‌కు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులతో డివైఎఫ్ఐ బృందం మాట్లాడింది. డివైఎఫ్ఐ జిల్లా బృందానికి మృతురాలి కుటుంబ సభ్యులు జరిగిన విషయాన్ని తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర ,అబ్దుల్లా ,ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లాకు చెందిన లీలావతి అనే మహిళ (53సంవత్సరాలు) ఎర్నియా సమస్యతో బాధపడుతూ మేడికవర్ హాస్పిటల్‌లో గత నాలుగు రోజుల క్రితం అడ్మిట్ అయిందన్నారు. 10వ తేదీ సర్జరీ చేసిన డాక్టర్లు మత్తులో ఉంది టైం పడుతుందని వారి కుటుంబ సభ్యులకు తెలిపారన్నారు. ఆమె కొడుకు వెళ్లి పదవ తేదీ రాత్రి పేషెంట్‌ను చూసివస్తానంటే కూడా అనుమతించలేదని, 11వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు మీ అమ్మకు స్ట్రోక్ వచ్చిందని మీరు వెళ్లి పేషెంట్‌ను చూడండని కుమారుడని అనుమతించారని, కానీ అతను వెళ్లేలోపే పది నిమిషాల్లోనే మేమేమీ చేయలేకపోయాము చనిపోయిందని చెప్పడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. పెద్ద కార్పొరేట్ హాస్పిటల్‌లో లక్షలకట్టి ప్రాణాలకు ఎలాంటి ఆపద వచ్చినా వాళ్లు చూసుకుంటారనే భరోసాతో ,రక్షణ ఉంటుందని ధైర్యంతో జాయిన్ అయితే డబ్బులు గుంజుకొని హాస్పిటల్లో ఉన్న పేషెంట్లకి స్ట్రోక్ వచ్చిందని చెప్పి తప్పించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

24 గంటలు ఐసియులో ఉండే డాక్టర్ల మధ్య పేషెంట్ కు గుండెపోటు వస్తే దానికి వారు ఏమి చేయలేకపోతే మరెందుకు లక్షల చెల్లించాలని, ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారని అన్నారు. చిన్న ఆపరేషన్ కోసం వచ్చిన మహిళను వారి నిర్లక్ష్యం ద్వారా మతికి కారణమైన మెడికవర్ హాస్పిటల్‌ను సీజ్ చేయాలని, మహిళా చనిపోవడానికి కారణాలన్నింటినీ వెలికి తీయాలని కర్నూలు నగరంలో మరేఎక్కడ ఏ హాస్పిటల్లో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

-జిజిహెచ్ అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యతను తెలుసుకుంటున్న కలెక్టర్

## నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి

**-జిజిహెచ్ అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

అన్న క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని జిల్లాకలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ క్యాంటీన్‌లో అందిస్తున్న భోజన నాణ్యత, వంటశాల పరిశుభ్రత, పాత్రల శు భ్రత, భోజనం చేసే ప్రాంతం, కూర్చునే సౌకర్యాలు, టోకెన్ వ్యవస్థ, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం క్యాంటీన్ సిబ్బంది, భోజనం చేస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడి, భోజనం ఎలా ఉంది అని వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భోజనం చేస్తున్న వారిలో ఒక వ్యక్తి మాట్లాడుతూ మా బంధువు మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. అన్న క్యాంటీన్‌లోనే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేస్తున్నాం. తక్కువ ధరకు మంచి నాణ్యతతో భోజనం లభిస్తోంది. బయట కంటే ఇక్కడి భోజనం చాలా బాగుంది” అని తెలిపారు. మిగిలిన వారు కూడా భోజనం రుచిగా ఉందని తెలిపారు. అన్న క్యాంటీన్ నిర్వహణలో లోపాలు ఉండకూడదని, పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. భోజన నాణ్యతపై రోజువారీ తనిఖీలు నిర్వహించి, రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ఇంటింటికి పింఛన్ అందజేయడం లేదని

**-కుంబలనూరు సెక్రెటరీ సస్పెన్షన్**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కోసిగి, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ, దేవనకొండ, కౌతాళం మండలాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయడం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ పంపిణీలో డబ్బులు తీసుకుంటూన్నారని పేర్కొన్నారు. చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించని కౌతాళం మండలం కుంబలనూరు పంచాయతీ సెక్రెటరీని సస్పెండ్ చేయాలని కలెక్టర్ డిపిఒను ఆదేశించారు. గురువారం పాజిటివ్ పర్సెప్షన్ అంశంపై జడ్‌పి సిఇఒ ,డిఆర్‌డిఎ పిడి, డిపిఒ తదితరులతో సమీక్షించారు. రెవెన్యూకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన ఇద్దరు విఆర్‌ఒలు, ఏడుగురు విలేజ్ సర్వేయర్లపై కూడా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డిపిఓ భాస్కర్ , డిఆర్‌డిఎ పిడి రమణా రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు అధిక ప్రాధాన్యత

**ఎయిర్ హూస్టెస్ సుస్మిత**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఏవియేషన్‌లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని ఎయిర్ డోవ్ డైరెక్టర్ సుస్మిత పేర్కొన్నారు.సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల హాస్టల్ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ వార్డెన్ డాక్టర్ పామీద బేగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎయిర్ హూస్టెస్ సుస్మిత మాట్లాడుతూ 2019లో భారతదేశంలో 12 శాతం మంది పైలెట్లు మహిళలు ఉన్నారని తెలిపారు. 2020లో భారత దేశంలో 15 శాతం మంది హెయిర్ హెూస్టెస్ మహిళలు ఉన్నారని తెలిపారు. విమానయాన రంగంలో కోర్సుల పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలు పొందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు.ఎం పార్వతి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఈనెల 13న శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం జిల్లా కోర్టు పరిధిలోని న్యాయ సేవా సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మార్గదర్శకాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలో మొత్తం 27 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అందులో కర్నూలు నగరంలో 7 బెంచ్‌లు, మిగిలిన 20 బెంచ్‌లు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ కోర్టుల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించేందుకు లోక్ అదాలత్ అత్యంత ముఖ్యమైన వేదిక అని తెలిపారు.